
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 1 జూన్ 2024



పద్మ అవార్డుల నామినేషన్‌కు దరఖాస్తులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 31: గణతంత్ర దినోత్సవం-2025 వేడుకలను పురస్కరించుకుని 2023-24 సంవత్సరంలో అర్హత పొందిన క్రీడాకారుల నుంచి పద్మ అవార్డుల కోసం నామినేషన్‌ను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ పేర్కొన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారు, అర్హత పొందిన క్రీడాకారులు వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 1వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఎంపీ స్థానం.. టీడీపీకి పదిలం

- ముందే ఆశలు వదిలేసుకున్న వైసీపీ
- అభ్యర్థి ఎంపిక నుంచి పోలింగ్ వరకూ తప్పిదాలే
- రామ్మోహన్‌నాయుడు హ్యాట్రిక్ విజయంపై కూటమి నేతల ధీమా



ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడుతోంది. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల గెలుపోటములపై ఇప్పటికే సర్వేలు చేపట్టి.. లెక్కలు వేసుకుని.. అంచనాకు వచ్చాయి. ఈ క్రమంలో జిల్లాలో ఎంపీ స్థానం.. టీడీపీకి పదిలమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు హ్యాట్రిక్ విజయం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా.. శ్రీకాకుళం ఎంపీ స్థానంపై ముందుగానే వైసీపీ ఆశలు వదులుకుంది. సర్వేలు కూడా కూటమి అభ్యర్థికి అనుకూలంగా ఉండడంతో.. వైసీపీ నాయకులు కనీసస్థాయిలో ఎంపీ సీటుపై లెక్కలు వేసుకోకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల్లో త్రిముఖ పోరులో శ్రీకాకుళం ఎంపీ స్థానం.. టీడీపీకి పదిలమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వైసీపీ అభ్యర్థిగా పేరాడ తిలక్.. కాంగ్రెస్ అభ్యర్థిగా పేడాడ పరమేశ్వరరావు ఈసారి ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో రామ్మోహన్‌నాయుడుకి మూడోసారి విజయం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కుమారుడిగా రామ్మోహన్ నాయుడు రాజకీయ ప్రవేశం చేసి.. 2014లో టీడీపీ తరఫున శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా 1,27,692 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యలపై ప్రస్తావిస్తూ.. జిల్లా వాణిని వినిపించడంలోనూ సత్తాచాటారు. ఇతర దేశాల్లో రాష్ట్ర ప్రజలు చిక్కుకుంటే వారిని స్వగ్రామాలకు తీసుకురావడంలో ప్రత్యేక చొరవ చూపేవారు. దీంతో ఎంపీగా రామ్మోహన్‌నాయుడుకి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇటువంటి వ్యక్తిని రాజకీయాలతో సంబంధం లేకుండా పార్లమెంట్‌కు పంపితేనే ప్రజా సమస్యలు పరిష్కార మవుతాయన్న భావన జిల్లావాసుల్లో నెలకొంది. అందుకే 2019లో జగన్ ఒక్కచాన్స్ హవాలోనూ.. టీడీపీ ఎంపీగా రామ్మోహన్‌నాయుడును రెండోసారి గెలిపించారు. గత ఎన్నికల్లో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 8 చోట్ల వైసీపీ అభ్యర్థులు గెలవగా.. క్రాస్ ఓటింగ్ ద్వారా ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాత్రం 6,653 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈసారి కూడా హ్యాట్రిక్ గెలుపు ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



కింజరాపు రామ్మోహన్‌నాయుడు



పేరాడ తిలక్



పేడాడ పరమేశ్వరరావు

● వైసీపీకి సన్నగిల్లిన ఆశలు

వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా ఈసారి పేరాడ తిలక్ బరిలో నిలిచారు. అభ్యర్థి ఎంపికలోనే వైసీపీ అధిష్ఠానం సరైన నిర్ణయం తీసుకోలేదని.. కొన్నాళ్లు చర్చ సాగింది. పార్టీలో ఎన్నికల ముందు వరకు ఉన్న కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణికి ఎంపీ టిక్కెట్ ఇచ్చి ఉంటే పోటీ తీవ్రత ఉండేదని.. ఇప్పుడు వార్ వన్‌సైడ్‌గా పరిస్థితి మారిపోయిందని వైసీపీ నాయకులు.. కార్యకర్తలు సైతం వాపోతున్నారు. వైసీపీ అభిమాని... నామినేటెడ్ పోస్టులో ఉన్న ఆ పార్టీకి చెందిన కీలకనాయకుడొకరు ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వద్ద వెల్లడించారు. ఎంపీ స్థానంపై ఆశలు వదిలేసుకున్నామని.. ఆ సీటు టీడీపీదేనని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా... వైసీపీ నాయకులు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సరిగ్గా పోల్‌మేనేజ్‌మెంట్ చేసుకోలేకపోయారన్నది నిజం. వైసీపీ అధిష్ఠానం.. ఎమ్మీ నియోజకవర్గంపై చూపిన శ్రద్ధ.. జిల్లాలోని ఆ పార్టీ నాయకులు అంతగా చూపించలేకపోయారు. నగదు పంపిణీ వ్యవహారంలో సొంత లాభం చూసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇక అసెంబ్లీ అభ్యర్థులే అటు ఎంపీ అభ్యర్థి ఓటుకు.. ఇటు ఎమ్మెల్యే అభ్యర్థి ఓటు పోలయ్యేలా పోల్‌మేనేజ్‌మెంట్ అప్పగించేశారు. ఈ క్రమంలో ఎంపీ అభ్యర్థి కన్నా.. తమ గెలుపే ముఖ్యమన్న రీతిలో ఎమ్మెల్యే అభ్యర్థులు వ్యవహరించారని సమాచారం. ఇలా ఎంపీ అభ్యర్థి ఎంపిక నుంచి పోలింగ్ వరకు తప్పిదాలే ఉన్నాయని.. అందువల్ల ఆ స్థానం ఓడిపోతున్నామంటూ బహిరంగంగానే వైసీపీ నాయకులు వెల్లడిస్తున్నారు.

● ఓట్ల చీలికతో మరింత నష్టం

2019 ఎన్నికల్లో జగన్ హవాలో కూడా ఓట్ల చీలికతో వైసీపీ అభ్యర్థికే భారీ నష్టం చేకూరింది. జనసేన, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతోపాటుగా ఇండిపెండెంట్ అభ్యర్థులు సైతం ఓట్లను చీల్చేశారు. దీంతో అప్పటి వైసీపీ ఎంపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ 6,653 ఓట్లతో ఓటమిపాలయ్యారు. ఇప్పుడు అంతకంటే మరింత ఇబ్బందికర పరిస్థితి వైసీపీకి ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా టెక్కలి నియోజకవర్గానికి చెందిన పేడాడ పరమేశ్వరరావు పోటీలో నిలిచారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థిగా టెక్కలి నుంచి కిల్లి కృపారాణి కాంగ్రెస్ నుంచే బరిలో దిగారు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల టెక్కలి నియోజకవర్గంలో పర్యటించగా.. వైసీపీ అభిమానులే అధికమంది హాజరయ్యారు. ఈ క్రమంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి ఓటమికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పరమేశ్వరరావు, అటు టెక్కలి అసెంబ్లీ అభ్యర్థి కృపారాణి గట్టిదెబ్బ కొట్టనున్నారు. కాంగ్రెస్ కారణంగా ఓట్ల చీలికతో వైసీపీకి నష్టం పెరగడం ఖాయమని.. అలాగే బీజేపీ, జనసేన పోటీలో లేకపోవడంతో టీడీపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడికి 2014 కంటే బంపర్ మెజార్టీ లభిస్తుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. త్రిముఖ పోటీలో టీడీపీకి లాభం చేకూరుతుండగా.. వైసీపీ తీవ్రనష్టం చవిచూడనున్నట్లు అన్ని సర్వేల్లోనూ వెల్లడవుతుండడంతో కూటమి నేతలు గెలుపుపై ధీమాతో ఉన్నారు.

2019లో పార్లమెంట్ స్థానానికి పోలైన ఓట్లు..

అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు (శాతం)
కింజరాపు రామ్మోహన్‌నాయుడు	టీడీపీ	5,34,544 (45.91%)
దువ్వాడ శ్రీనివాస్	వైసీపీ	5,27,891 (45.34%)
మెట్ట రామారావు	జనసేన	31,956 (2.74%)
నోటా	నోటా	25,545 (2.19%)
డోల జగన్	కాంగ్రెస్	13,745 (1.18%)
పేర్ల సాంబమూర్తి	బీజేపీ	8,390 (0.72%)
ఎన్.రాజశేఖర్	ఇండిపెండెంట్	5,156 (0.44%)
ఎన్.కృష్ణమోహన్	ఇండిపెండెంట్	4,836 (0.42%)
బి.వివేకానంద మహారాజ్	ఇండిపెండెంట్	3,818 (0.33%)
ఎం.సతీష్ చక్రవర్తి	పిరమిడ్ పార్టీ	1,448 (0.12%)
	మొత్తం	11,57,329 (74.48%)



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఐజీ విశాల్ గున్ని

ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ చర్యలు

- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

శ్రీకాకుళం క్రైం, మే 31: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక పోలీసు అధికారుల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. వర్చువల్ విధానం ద్వారా డీఐజీ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బందోబస్తు, తదితర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. 'ఓట్ల లెక్కింపు రోజున ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేసే వారిని ముందుగా గుర్తించాలి. ఒకచోట ప్రజలు గుమిగూడకుండా చర్యలు చేపట్టాలి. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ఠ భద్రతతో పాటు అనూహ్య ఘటనలు జరగకుండా పికప్ బృందాలను నియమించాలి. 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేయాలి. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి. సామాజిక మాధ్యమాల్లో నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలి. సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్, పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేయాలి. లాడ్జిలు, హోటల్స్‌ను తనిఖీ చేసి కొత్త, పాత నేరస్థుల వివరాలపై ఆరా తీయాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి' అని డీఐజీ ఆదేశించారు.

- ఎస్పీ రాధిక మాట్లాడుతూ 'పోలీసుస్టేషన్ పరిధిలో చిన్న ఘటన జరిగినా తక్షణమే అందుబాటులో ఉన్న బలగాలతో చేరుకుని గొడవలు నియంత్రించాలి. గ్రామాల్లో షాడో, పెట్రోలింగ్ బృందాలు అనునిత్యం పర్యటిస్తాయి. రాజకీయపార్టీల కార్యాలయాల వద్ద, అభ్యర్థుల ఇళ్ల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలి. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి.. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా హెచ్చరించాలి. కమాండ్ కంట్రోల్‌రూమ్ ద్వారా జిల్లాలో ఎక్కడ ఏమి జరిగినా క్షణాల్లో చేరుకునేలా భద్రతా చర్యలు తీసుకోవాల'ని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డి.గంగాధర్‌రావు, డీఎస్పీలు వై.శృతి, త్రినాథరావు, విజయకుమార్, శేషాద్రినాయుడు, సీఐలు సోమశేఖర్, సత్యనారాయణ రెడ్డి, అవతారం, ఎల్.సన్యాసినాయుడు, జి.ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ, నిర్మల పాల్గొన్నారు.

వడదెబ్బకు రైతు మృతి



సన్యాసిరావు (ఫైల్)

జి.సిగడాం, మే 31: జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన రైతు తాడేల సన్యాసిరావు(75) శుక్రవారం వడదెబ్బకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సన్యాసిరావు శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో.. ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్నారా? లేదా? అని చూసేందుకు పొలానికి వెళ్లాడు. వడదెబ్బకు గురై మార్గమధ్యలో కుప్పకూలిపోయాడు. సన్యాసిరావు ఇంటి వద్ద లేకపోవడంతో.. కుమారుడు భవానీ శంకర్ పొలానికి వెళ్లి చూడగా మార్గమధ్యలో విగతజీవిగా కనిపించాడు. వెంటనే సపర్యలు చేయగా అప్పటికే సన్యాసిరావు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య వెంకటమ్మ, కుమారుడు భవానీ శంకర్ ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహమై.. వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు.

జూన్.. దడ!



- విద్యా సంవత్సరం ఆరంభం.. సామాన్యులకు గుండె భారం
- పెరిగిన ఫీజులు, పుస్తకాల ధరలు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన
- పిల్లల చదువు కోసం వ్యయప్రయాసలు

(రణస్థలం)

జూన్.. ఈ నెల వచ్చిందంటే విద్యార్థుల తల్లిదండ్రులకు దడ పుడుతుంది. విద్యాసంవత్సరం ఆరంభం కావడమే ఇందుకు కారణం. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు చదువు'కొనాల్సి' వస్తోంది. నర్సరీ కోసం ఒక్కో విద్యార్థికి కనీసం రూ.30వేల నుంచి రూ.50వేలు ఖర్చువుతోంది. దీంతో ఉన్నత విద్య కన్నా ప్రాథమిక విద్య సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు నమ్మకంలేకపోవడంతో భారమని తెలిసినా, 'ప్రైవేటు' విద్యే దిక్కవుతోంది. ఫీజుల నియంత్రణపై పట్టించుకోవాల్సిన విద్యాశాఖ నిద్ర నటిస్తోంది. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. గతేడాది కన్నా ఫీజులు, పుస్తకాల ధరలు పెంచేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు వెంటాడుతోంది.

- రణస్థలం మండల కేంద్రానికి చెందిన బ్రహ్మాజీ రోజువారి కూలీ. ఇద్దరు పిల్లలు ఉన్నత తరగతులకు వచ్చారు. ఆయన నెల ఆదాయం రూ.20వేలు మాత్రమే. ఆ డబ్బులతోనే పిల్లల చదువులతో పాటు కుటుంబ జీవనం కొనసాగించాలి. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం పెరగడంతో ఆందోళన చెందుతున్నాడు. పిల్లల చదువు కోసం ఇప్పటికే రూ.లక్ష అప్పు చేశాడు.

- పైడిభీమవరానికి చెందిన శ్రీనివాసరావు పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు. పెద్దకుమార్తెను ఇంటర్‌లో చేర్పించాలని డిసైడయ్యాడు. కానీ ఒక్క ఏడాది ఫీజు రూ.లక్షన్నర. తనకు వచ్చే అరకొర వేతనం చాలక.. ఫీజుల భారం భరించలేక సతమతమవుతున్నాడు. కుమార్తె భవిష్యత్ కోసం అప్పు చేసి అయినా చదివించక తప్పదని వాపోతున్నాడు.

సాధారణంగా ఒకటో తేదీ అంటే ప్రతివర్గంలోనూ ఆందోళన వెంటాడుతుంది. పాలవాడు నుంచి కేబుల్ బిల్లు వరకూ.. ఇంటి అద్దె నుంచి కరెంట్ బిల్లు వరకూ చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు చీటీలు, ఈఎంఐలు చెల్లించాలి. కాగా.. జూన్ నెలలో వీటికి అదనంగా విద్యార్థుల చదువుల భారం పడుతుంది. పిల్లల పాఠశాలల్లో చేరిక, వారి ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు తదితర ఖర్చులు అధికం. అందుకే జూన్ వచ్చిందంటే సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో ఒకటే ఆందోళన. ఎలా అధిగమించగలమో అన్న భయంతో కొంతమంది అప్పులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు గతేడాది కన్నా అదనంగా పెంచేశారు. కొన్ని యాజమాన్యాలు నర్సరీ నుంచే అధిక ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ల ఫీజే రూ.వెయ్యి నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నాయి. ఇక ట్యూషన్ ఫీజు కింద రూ.22,500 చెబుతూ.. మూడు టెర్మ్‌ల్లో చెల్లించాలని స్పష్టం చేస్తున్నాయి. పుస్తకాలకు సుమారు ఐదారు వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నాయి. వీటితోపాటు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, యూనిఫాం, షూ, ఇతర ఖర్చులు అదనం. దూరాన్ని బట్టి ట్రాన్స్‌పోర్ట్ చార్జీ ఏడాదికి సుమారు రూ.15వేల వరకు అవుతోంది. దీంతో మొత్తంగా నర్సరీ విద్యార్థిని చదివించాలంటే.. సుమారు రూ.50వేలు ఖర్చవుతోంది. దీంతో చదువుల భారం తమకు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

● ప్రభుత్వ విద్య బలోపేతమేదీ?

వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరిట ఆర్భాటాలు చేసింది. కానీ విద్యకు సంబంధించి ప్రోత్సాహకాలు మాత్రం పెరగడం లేదు. విద్యాపరంగా అసంబద్ధ నిర్ణయాలతో పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తోంది. ప్రభుత్వం అమ్మఒడి కింద కుటుంబంలో ఒక్క విద్యార్థికి మాత్రమే రూ.13,500 చొప్పున చెల్లించేది. కానీ ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీతో తమపై అదనపు భారం పడేదని సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. అలాగే నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. వసతులు సైతం పెరిగాయి. కానీ ఆ ఆనందం ఎన్నిరోజులూ నిలవలేదు. పాఠశాల సర్దుబాటు పేరిట కొన్నింటిని మూతవేయించింది. నాడు-నేడుతో పెట్టిన రూ.లక్షల పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరులా మారిపోయాయి. అసలు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ఉంటే ప్రజలు కార్పొరేట్ విద్య వైపు చూసే అవకాశమే లేదని పలువురు పేర్కొంటున్నారు. కనీసం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించలేని స్థితిలో విద్యాశాఖ ఉందని విమర్శిస్తున్నారు.

రూ.10 వేల అదనపు భారం

గతేడాది మాకు దగ్గర్లో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో మా బాబుకి ఆరో తరగతి ఫీజును రూ.20వేలు చెల్లించాం. ఇప్పుడు ఏడో తరగతికి రూ.30వేలు కట్టాలని యాజమాన్యం చెబుతోంది. ఒక్క ఏడాదికే రూ.10 వేల భారం పెంచడం దారుణం. ఇలాగైతే పిల్లల చదువులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-జి.లక్ష్మి, రణస్థలం

తట్టుకోలేకపోతున్నాం

పిల్లల చదువులతో ఆర్థిక భారం పడుతోంది. ఏటా ఫీజుల ధరలు పెరుగుతున్నాయి. ఆర్థికంగా తట్టుకోలేకపోతున్నాం. కనీసం ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించకపోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాలి.

-జె.అప్పారావు, రణస్థలం

నిబంధనలు పాటించాలి

విద్యాసంస్థలు నిబంధనలు పక్కాగా పాటించాలి. ఇప్పటికే అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఎక్కడైనా ఫీజుల కోసం బలవంతం పెడితే ఫిర్యాదు చేయాలి. ప్రభుత్వం నిర్దేశించిన ధరలనే ఫీజుగా తీసుకోవాలి. లేదంటే చర్యలు తప్పవు.

- కె.వెంకటేశ్వరరావు, డీఈవో, శ్రీకాకుళం

చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

- అడ్డుకున్న సెక్రటరీపై విరుచుకుపడిన వైనం

శ్రీకాకుళం రూరల్, మే 31: శ్రీకాకుళం మండలం తండ్యాంవలసలోని చెరువులో మట్టిని కొందరు స్థానికులు అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల ఇదే గ్రామంలోని సర్వేనెంబర్ 94లో చెరువు గర్భ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం కొంతమంది అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్లతో మట్టిని తరలించేందుకు యత్నించారు. సచివాలయ సెక్రటరీ సుప్రజ, వీఆర్వో ఘటనా స్థలానికి చేరుకుని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేయరాదని తెలిపారు. దీంతో గ్రామస్థులు సెక్రటరీపై మాటలతో విరుచుకుపడ్డారు. చెరువు గర్భ భూములు ఆక్రమణకు గురైనప్పుడు, మట్టిని అక్రమ నిర్మాణాలకు వినియోగించినప్పుడు అవసరంలేని అనుమతులు.. ఇప్పుడు ఎలా గుర్తొచ్చాయని నిలదీశారు. దీనిపై సెక్రటరీ సుప్రజ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న అధికారులు

'ఓ తల్లికి కడుపుకోత'!

- జిల్లా కేంద్రాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై వెలసిన ఫ్లెక్సీలు

టెక్కలి, మే 31: టెక్కలిలో జిల్లా కేంద్రాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై 'ఓ తల్లికి కడుపుకోత' పేరిట వెలసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారాయి. టెక్కలి మండలం రావివలస పంచాయతీ చిన్ననారాయణపురానికి చెందిన దాసరి మురళి, నిరోషా దంపతుల కుమారుడు సాయి వినీత్(12).. మే 21న తోటిపిల్లలతో కలిసి క్రికెట్ ఆడాడు. పొదల్లోకి బాలు వెళ్లగా.. దాన్ని తీసుకువచ్చేందుకు వెళ్లిన సాయివినీత్‌కు ఏదో కరవడంతో.. కాసేపటికి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఆ బాలుడ్ని కుటుంబ సభ్యులు టెక్కలిలోని జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. వైద్యసిబ్బంది ఆ బాలుడికి ముల్లు గుచ్చి ఉంటుందేమోనని భావించి.. సుమారు రెండు గంటలపాటు నిర్లక్ష్యం చేసి.. తూతూమంత్రంగా వైద్యసేవలందించారు. చివరికి బాలుడి పరిస్థితి విషమించడంతో చేతులెత్తేసి.. శ్రీకాకుళంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)కి రిఫర్ చేశారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. నరసన్నపేట చేరుకునేసరికి బాలుడి పరిస్థితి మరింత విషమించింది. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా సాయివినీత్ పాము కాటుతో మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఒక్కగానొక్క కుమారుడు కళ్లెదుటే మృతి చెందడంతో ఆ తల్లి తట్టుకోలేకపోయింది. 22న ఆమె నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడింది. కాగా.. కుమారుడు జ్ఞాపకాలు వెంటాడుతునే ఉండడంతో ఆ దంపతులకు కన్నీళ్లు ఆగడం లేదు. తమకు జరిగిన అన్యాయాన్ని తట్టుకోలేక.. 'ఓ తల్లికి కడుపుకోత' అంటూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ టెక్కలిలో పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'మాకు కడుపుకోత మిగిల్చిన మీకు శ్రద్ధాంజలి. పాముకాటుకు, ముళ్లు గుచ్చుకోవడానికి తేడా తెలియని వారికి శతకోటి వందనాలు' అంటూ వైద్యుల నిర్లక్ష్యం తీరును ఎండగట్టారు. ఇప్పటికే రిఫరల్ ఆస్పత్రిగా పేరొందిన జిల్లాకేంద్రాసుపత్రిలో వైద్యుల తీరు మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెరుగైన వైద్యసేవలందించేలా చర్యలు చేపట్టాలని పలువురు వేడుకుంటున్నారు.



టెక్కలి పాతబస్టాండ్ ప్రాంతంలో వెలసిన ఫ్లెక్సీ



ఎండి'నది'

- గొట్టాబ్యారేజీ వద్ద పూర్తిగా తగ్గిన ఇన్‌ఫ్లో

హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద ఎగువ ప్రాంతంలో వంశధార నది పూర్తిగా ఎండిపోయింది. క్యాచ్‌మెంట్ ఏరియాలో కొన్ని నెలలుగా వర్షాలు లేక ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోయింది. ఐదేళ్ల తర్వాత బ్యారేజీ ఎగువ ప్రాంతంలో నీరు అడుగంటి పోయిందని వంశధార అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నదీ పరివాహక ప్రాంతాల్లో బావుల్లో నీరందక.. కొళాయిల ద్వారా కూడా అంతంతమాత్రంగానే నీటి సరఫరా అవుతోంది. రబీలో సాగునీరందంచలేదని దుస్థితి నెలకొంది. కాగా.. ప్రస్తుతం నీరు లేకపోవడంతో బ్యారేజీ వద్ద మరమ్మతులు చేపట్టేందుకు అనువుగా ఉన్నా.. నిధుల లేమి కారణంగా పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు.

- హిరమండలం

సినిమా చూడకుండానే రివ్యూ ఇస్తున్నారు



విష్వక్‌సేన్

"సినిమా చూసి నిజాయితీగా సమీక్ష రాయడంలో తప్పు లేదు. కానీ కొంత మంది సినిమా చూడకుండానే ఆ పని చేస్తున్నారు. మరికొందరు కావాలనే నెగెటివ్ రివ్యూలు రాస్తున్నారు. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రేక్షకులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాన్ని చూసేందుకు వస్తున్నారు' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా థియేటర్ల దగ్గర ప్రేక్షకుల సందడి కనిపించ లేదు. ఇప్పుడు మా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం కోసం మళ్లీ ప్రేక్షకులు థియేటర్ల బాట పడుతున్నారు. మా సినిమాకు వస్తున్న ప్రేక్షకాదరణకు చాలా ఆనందంగా ఉంది. 'విష్వక్ సినిమాల ఎంపికలో వైవిధ్యం చూపుతారని ప్రశంసలు వస్తున్నాయి. నాలోని నటుడిగా సవాల్ విసిరేలా ఉంటేనే సినిమా చేయడం అలవాటు. ఇకముందు కూడా ఇలాంటి కొత్తదనం ఉన్న కథలతో వస్తాను' అన్నారు. 'బాల కృష్ణ గారు, వారి కుటుంబ సభ్యులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా బావుందని మెచ్చుకున్నారు. మంచి వసూళ్లు వస్తున్నాయని అన్ని ఏరియాల డిస్ట్రిబ్యూటర్లు ఫోన్ చేసి చెప్పారు. దీనికి త్వరలోనే సీక్వెల్ చేస్తాం' అని కృష్ణ చైతన్య చెప్పారు.

మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ

శర్వానంద్ హీరోగా నటించిన 35వ చిత్రం 'మనమే' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రకథానాయిక కృతి శెట్టి శుక్రవారం ఈ సినిమా విశేషాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ చేసిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేసిన నాకు ఈ పాత్ర చాలా కొత్తగా అనిపించింది. 'ఇంత స్ట్రిక్ట్‌గా ఉండాలా' అని దర్శకుడు శ్రీరామ్‌ను అడిగాను. అలాగే కావాలనడంతో ఆయన్ని ఫాలో అయ్యా.
- శర్వానంద్ అద్భుతంగా నటించారు. నిన్నే సినిమా చూశా. ప్రతి సీన్‌లో ఆయన అదరగొట్టారు. ఇందులో నా ఫేవరెట్ సీన్ ఒకటుంది. దాని కోసం చాలా వెయిట్ చేశా. ఎలా చేయాలా అని ఆలోచించా. కానీ శర్వానంద్ చాలా క్యాజువల్‌గా వచ్చి ఒకే ఒక్క నిమిషంలో ఆ సీన్ చేయడంతో చాలా ఆశ్చర్య పోయా.
- స్ట్రాంగ్ ఎమోషన్స్ కలిగిన ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ 'మనమే'. కిడ్, పేరెంట్ ఎమోషన్ కూడా ఉంది. గ్లోబల్ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది. శర్వానంద్, నేను, పాప.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. అందుకే 'మనమే' అని పేరు పెట్టారు.
- చిత్రం షూటింగ్ లండన్‌లో జరిగింది. అక్కడి వెదర్ ఎప్పటికప్పుడు మారిపోయేది. ఒక్కోసారి హఠాత్తుగా వర్షం పడేది. అటువంటి వాతావరణంలోనూ నిర్మాత చక్కగా ప్లాన్ చేయడం వల్ల షూటింగ్ బాగా జరిగింది.
- ప్రస్తుతం మూడు తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. అలాగే ఓ మలయాళ సినిమా కూడా చేస్తున్నాను.



జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం

సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'హరోంహర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ థియేట్రికల్ ట్రైలర్‌ను సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌ను మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సుధీర్‌బాబుకు, టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ లాంచ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సుధీర్‌బాబు రాంబోలా ఉంటాడు. ఇందులో జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం అని చెప్పడం ఆసక్తికరంగా ఉంది. రాయలసీమ యాస లో సుధీర్ బాబు అద్భుతంగా మాట్లాడారు. ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్ కావాలి' అని కోరారు. 'ట్రైలర్ టెర్రిఫిక్‌గా ఉంది. విజువల్స్ బాగున్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అన్నారు సంపత్ నంది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'యాక్షన్ సినిమా చేయమని కృష్ణ గారు చాలా సార్లు చెప్పారు. ఈ సినిమా ఆయనకు ఆనందం కలిగిస్తుందని నమ్ముతున్నా. ఇండియన్ సినిమాలో 'హరోంహర' లాంటి బ్యాక్‌డ్రాప్ ఉన్న సినిమా రాలేదనే చెప్పాలి. యాక్షన్ సీన్లు టాప్ రేంజ్‌లో ఉంటాయి. నిర్మాతలు బాగా ఖర్చు పెట్టారు. దర్శకుడు సాగర్ ఈ సినిమా కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించారు' అని చెప్పారు. జూన్ 14న సుధీర్‌బాబు మాస్ సంభవం చూడబోతున్నారని దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక చెప్పారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/4uAYVEx లో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

సిడాక్-ఈఆర్‌డీసీఐఐటీ

తిరువనంతపురంలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)కు చెందిన ఈఆర్&డీసీఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఈఆర్‌డీసీఐఐటీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రామ్ ఇన్ ఇంజనీరింగ్(ఎంటెక్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా లైవ్ ప్రాజెక్ట్ వర్క్‌లు, సిడాక్ ఆర్ అండ్ డీ ల్యాబ్స్‌లో ఇంటర్న్‌షిప్ ఉంటాయి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: వీఎల్ఎస్ఐ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. సైబర్ ఫోరెన్సిక్స్ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే నాన్ గేట్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. వీరికి డిగ్రీ స్థాయిలో ఆరో సెమిస్టర్ వరకు వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 6
- **ఈ-మెయిల్:** erdciit@cdac.in
- **వెబ్‌సైట్:** http://erdciit.ac.in

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్'. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.



ఎంటెక్

మౌలానా ఆజాద్ వర్సిటీ

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి.

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ఐఈటీఈ/ఏఎంఐఈ(ఈసీఈ/సీఎస్ఈ/ఐటీ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్/అప్లయిడ్ ఫిజిక్స్)/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 15
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 26 నుంచి
- **వెబ్‌సైట్:** https://manuu.edu.in

డా.వైఎస్సార్‌హెచ్‌యూలో డిప్లొమాలు

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి.

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-సేవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్

ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత ఉద్యోగాలకు ఉద్దేశించిన ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్-02/2024) నోటిఫికేషన్ విడుదలైంది. కోర్సు 2025 జూలైలో ప్రారంభం కానుంది.

1. **ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)
2. **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఫ్లయింగ్

అర్హతలు: ఇంటర్(ఫిజిక్స్, మేథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టం పరీక్ష, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 28

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 9, 10, 11

వెబ్‌సైట్: https://afcat.cdac.in/AFCAT/

యూపీఎస్సీ ఎన్‌డీఏ ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. త్రివిధ దళాల్లో 2025 జూన్ 2 నుంచి ప్రారంభం అయ్యే 154వ కోర్సులో, 116వ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏసీ) కోర్సులో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. అర్హులైన మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- యూపీఎస్సీ - నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్(2)-2024

ఖాళీలు: మొత్తం 404. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్‌ఫోర్స్-120) ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు. నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 34 ఉన్నాయి.

అర్హత: ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేసుకునే వారు ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



వయసు: అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 2006 జనవరి 1కి ముందు, 2009 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: అభ్యర్థులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

కోర్సులు: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: సెప్టెంబరు 1

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

వెబ్‌సైట్: https://upsc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gliKhrpలో చదవండి.







రైతులకు భరోసా ఏదీ?

- కానరాని పురుగు మందుల పంపిణీ
- వైసీపీ కార్యకర్తలకే యంత్ర పరికరాలు
- ఆర్బీకేల్లో అందుబాటులో ఉండని సిబ్బంది
- మట్టి నమూనా వివరాలు ఇవ్వని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలు

(మెళియాపుట్టి)

క్షేత్రస్థాయిలోనే రైతులకు అవసరమైన సేవలు అందిస్తాం.. ఇందుకోసమే పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం.. అక్కడి నుంచే రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీపై యంత్ర పరికరాలు అందిస్తాం.. రైతు పంటలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం సచివాలయాల పరిధిలోనే ఆర్బీకేలను ఏర్పాటు చేసింది.. సిబ్బందిని నియమించింది.. అయితే ధాన్యం కొనుగోలు, ఎరువులు, వరి విత్తనాలు తప్పా మిగిలిన సేవలు రైతులకు అందడం లేదు. దీంతో రైతులు నిట్టూర్పు విడవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాల్లో ఈ ఏడాది 4.37 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే ఇప్పటి వరకు మట్టి నమూనా పరీక్షలు, విత్తనాలు అందించలేదు. మట్టి నమూనా పరీక్షలు చేసి వాటి ఫలితాలను రైతులకు అందించి ఏ రకం పంట వేయాలో వ్యవసాయాధికారులు చెబితే మంచి ఫలితాలు వస్తాయి. అయితే ఏ గ్రామంలోనూ ఆ పరిస్థితి కనిపించడం లేదు. గతంలో రైతులకు అవగాహనకు సమావేశాలు నిర్వహించేవారు. ఇప్పుడు ఎక్కడా జరగడం లేదని రైతులు చెబుతున్నారు. 856 రైతుభరోసా కేంద్రాల ద్వారా సేవలు అందాల్సి ఉండగా ఎక్కడా కానరావడం లేదు.



ఇలాయిపురంలో ఓ ఇంటిలో నిర్వహిస్తున్న ఆర్బీకే

అందుబాటులో ఉండని సిబ్బంది..

రైతుభరోసా కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆందోళన చెందు తున్నారు. మండల కేంద్రంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని పూర్తిగా వదిలేశారు. వ్యవసాయాధికారి ఎక్కడ ఉంటున్నారో.. ఎప్పుడు వస్తున్నారో వారికే ఎరుక. మెళియాపుట్టి, రైతుభరోసా కేంద్రమే మండల వ్యవసాశాఖ కార్యాలయంగా వినియోగిస్తున్నారు. అది కూడా ఎంపీ నిధులతో నిర్మించిన సామాజిక కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఆర్బీకేలో సిబ్బంది సైతం లేదు. రైతులకు సమాధానం చేప్పే నాథుడే కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రారంభానికి నోచుకోని ఆర్బీకే భవనం



వైసీపీ నాయకులకు కేటాయించిన ట్రాక్టర్

వైసీపీ కార్యకర్తలకే లబ్ధి..

యంత్రసేవ పథకంలో ఆర్బీకే పరిధిలోని ఐదుగురు చొప్పున రైతులను కమిటీగా ఏర్పాటు చేశారు. ఈకమిటీలకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, రోటో వేటర్లు, దుక్కి యంత్రాలు, వరిసాట్లు, కోత, నూర్పిడి యంత్రాలతో పాటు పరికరాలు అందించాల్సి ఉంది. 10 శాతం రైతులు, 40 శాతం ప్రభుత్వం, 50 శాతం బ్యాంకు రుణాల ద్వారా అందజేశారు. అయితే ఈ పథకంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించకపోవడంతో కేవలం వైసీపీ నాయకులకు మాత్రమే ఈ పథకం పరిమితమైందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

గిట్టుబాటు ధర లేదీ?

పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కీలకంగా పనిచేయాల్సిన ఆర్బీకేలు మొక్కుబడిగా మారి పోయాయి. మిల్లర్లు తేమ శాతం పేరుతో రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడంలో అన్యాయం జరుగుతున్నా పట్టించు కునే నాథుడే కరువయ్యాడు. ధాన్యం ఇచ్చినా సకాలంలో రైతు ఖాతాల్లో నగదు జమకాని పరిస్థితి కనిపిస్తోంది.

జాడలేని ఉద్యానవన శాఖ..

గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉద్యానపంటలు వేస్తారు. అయితే ఈ శాఖకు ఐదేళ్లుగా ఎటువంటి నిధులు రాకపోవడంతో వారి జాడే కానరాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మెట్ట రైతులకు అధికంగా జీడి, మామిడి పంటలతో పాటు అంతరపంటలు సాగు చేసేలా అవగాహన కల్పించి యంత్రాలు అందించే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఆర్బీకేలను బలోపేతం చేయడం ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులకు మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రతివారం వైద్య పరీక్షలు చేపట్టాలి



సబ్ జైలులో సూచనలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

నరసన్నపేట/గుజరాతిపేట: జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం అంపోలులోని జిల్లా జైలు, నరసన్నపేట సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించారు. ముద్దాయిలకు అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకు ప్రతి వారం వైద్యపరీక్షలను నిర్వహించాలని జైలు అధికారులకు సూచించారు. భోజన వసతుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్ర మంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి హరిప్రియ, జైలు అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

వజ్రపుకొత్తూరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ కనబరచాలని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో శార్వాణి అన్నారు. శుక్రవారం మండల మహిళాసమాఖ్య భవనంలో ప్రపంచ రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవంలో సందర్భంగా అవగాహన, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు గంగమ్మ, ధనలక్ష్మి, లత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా

నరసన్నపేట: ఉర్లాం గ్రామం వద్ద శుక్రవారం అదుపు తప్పి టిప్పర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. లుకలాం, నరింగరాయుడుపేట తదితర ప్రాంతాల నుంచి కాలువ గట్లు, పొలాల నుంచి ఇటుకల తయారీ కోసం మట్టిని తీసుకువస్తున్న టిప్పర్ అతివేగంగా వెళుతున్న నేపథ్యంలో ఒక్కసారి అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎటువంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు సల్పగాయాలయ్యాయి. టిప్పర్లు అతివేగంతో వెళుతుండడంతో భయాందోళన కలుగుతోందని, తగు చర్యలు తీసుకోవాలని ఉర్లాం, యారబాడు, కోమర్తి ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర దృశ్యం

నరసన్నపేట: హనుమజ్జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలో శ్రీశక్తి ఆంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. అర్చకులు వనమాలి శివశంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలతో కలిసి స్వామి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. శోభాయాత్ర పెద్దపేట, జోగిపేట, కాలేజీ రోడ్డు, మెయిన్ రోడ్డులో సాగింది. శని వారం ప్రత్యేక పూజలు నిర్వహించి నారాయణసేవ చేపట్టనున్నారు. పలు దేవాలయాల్లోనూ హనుమజ్జయంతిని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు

సంతబొమ్మాళి: హనుమజ్జయంతి సందర్భంగా మండలంలో పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తు న్నారు. బోరుభద్ర, దండుగోపాలపురం, మలగాం, శ్రీకృష్ణాపురం, ఉదయపురం తదితర గ్రామాల్లో ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, భక్తులు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

● **హరిపురం:** హరిపురం-బాలిగాం కూడలిలో ఎస్‌బీఐ ఎదురుగా ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు పూజా కమిటీ సభ్యుడు ప్రసాద్ స్వామి తెలిపారు. ప్రత్యేక పూజలతోపాటు భజనలు నిర్వహించనున్నామన్నారు. భక్తు లంతా పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ● **పోలాకి:** సంతలక్ష్మీపురం, బెలమర, దీర్ఘాశి, రాళ్లపాడు, జగన్నాథ స్వామి కాలనీ, ప్రియా గ్రహారం, బెలమర, బొద్దాం, తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతి వేడుకలు నిర్వ హించేందుకు ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, భక్తులు పాల్గొని స్వామిని దర్శించు కోవాలని కోరారు. ● **జలుమూరు:** మండలంలో శనివారం నిర్వహించనున్న హనుమ జ్జయంతి వేడుకలకు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. చల్లవానిపేట కూడలితో పాటు గంగాధరపేట, కేఎల్ఎన్‌పేట, జలుమూరు, అంధవరం, రాణ, తిలారు కూడలి, తదితర గ్రామాల్లోని ఆంజనేయ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సేవలే గుర్తింపునిస్తాయి



ఎంపీడీవో శివప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

నందిగాం: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఎంపీడీవోగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన గుంటముక్కల శివప్రసాద్‌ను సిబ్బంది సన్మానించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, మంగమ్మ దంపతులను పంచాయతీ కార్య దర్శులు, మండల పరిషత్, సచివాలయాల సిబ్బంది దుశ్శాలువాలు, పూలమాలలతో సత్క రించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.రాజారావు, ఎంఈవో జి.నర్సిం హులు, ఏపీవో ఎం.నాగరాజు, ఏపీఎం కె.జాంబవతి తదితరులు పాల్గొన్నారు.

సాంబమూర్తి మాస్టారు సేవలు అభినందనీయం



సాంబమూర్తిని సత్కరిస్తున్న హెచ్‌ఎం

దీర్ఘాశి(పోలాకి): దీర్ఘాశి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన టీకే సాంబమూర్తి మాస్టారు విద్యాభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమని హెచ్‌ఎం సుగ్గు శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ మెండ కృష్ణ సుమంగళి, ఎంపీటీసీ ప్రతినిధి పాగోటి తాతబాబు తదితరులు అన్నారు. శుక్రవారం సాంబమూర్తి మాస్టారును పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు. 40 ఏళ్ల పాటు ఆయన విద్యాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. అయనను దుశ్శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పుస్తకాలు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేం దుకు గాను పాఠ్యపుస్తకాలు శుక్రవారం చేరుకున్నాయి. మొత్తం 43 వేల పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు 26 వేలు వచ్చాయని విద్యా శాఖాధికారులు తెలిపారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో అందజేస్తామని ఎంఈవో శాంతారావు తెలిపారు.

వరి విత్తనాలు ఎప్పుడిస్తారు...

- మండల సమావేశంలో సభ్యుల ఆందోళన

మెళియాపుట్టి: వరి నారు వేసేందుకు సమయం దగ్గర పడుతున్నా నేటికీ రైతులకు విత్తనాలు అందించలేదని, ఎప్పుడిస్తారని పలువురు సభ్యులు ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసుంధర ఎంపీటీసీ సభ్యులు సలాన చిట్టి తదితరులు మాట్లాడుతూ.. విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వ్యవసాయాధికారుల అశ్రద్ధ వల్ల విత్తనాల ఎంపికలో సరైన అవగాహన లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఏవో దానకర్ణుడు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే సకాలంలో విత్తనాలను రైతులకు అందిస్తామని చెప్పారు. గోకర్ణపురం పంచాయతీలో జల్‌జీవన్ పనులు నిలిచిపోయాయని, దీంతో తాగునీటికి ఇబ్బం దులు ఎదుర్కొం టున్నారని సర్పంచ్ రవికుమార్ అన్నారు. మాకనాపల్లి, దాసుపురం పాఠశాలల్లో సౌక ర్యాలు లేవని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోందని చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు గూడ ఎండయ్య, వైస్ ఎంపీ పీ ఆదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాట్స్ జానపద సంబరాల్లో తప్పెటగుళ్ల ప్రదర్శన

పలాస: గుంటూరులో శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద సంబరాల్లో పలాసకు చెందిన కోనారి హేమసూదన్, పాలిన శంకర్ బృందం తప్పెటగుళ్ల ప్రదర్శన చేపట్టారు. నాట్స్ అధ్యక్షుడు బాపయ్య చౌదరి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కళాకారులకు సత్కరించి అభినందించారు. తెలుగు జానపదాలకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రంగం టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా తప్పెటగుళ్ల కళాకారులకు అవకాశం ఇచ్చారు.

క్రీడా స్ఫూర్తి అవసరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి అవసరమని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సబ్‌కలెక్టర్ ప్రారంభించారు.

తూర్పుగోదావరి జట్టు విజయం

శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు 41.4 ఓవర్లలో 167 పరుగులకు ఆలౌటైంది. ఆ తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు 39.4 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసి విజయం సాధించింది. మురళి 61 పరు గులు, లోహిత్ 44 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ, సుదన్ చెరో రెండు వికెట్లు తీశారు. కార్యక్రమంలో మెంటార్ ఇలియాస్ అహ్మద్, వండాన మురళి, ఎల్.లాల్‌బహదూర్, బెండి సురేష్, కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాల సాధన దిశగా సంపద కేంద్రం



కోదూరులో చెత్త నుంచి సంపద తయారీని పరిశీలిస్తున్న డీఎల్పీవో రమణ

పాతపట్నం: సత్ఫలితాల సాధన దిశగా కోదూరు పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం తొలి అడుగులు పడుతున్నాయని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ ప్రశం సించారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్‌లతో మాట్లాడుతూ మెలకువలు పాటించడం ద్వారా వర్మీ కంపోస్టు తయారీ చేయవచ్చున్నారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేసి తద్వారా ఎరువుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. అంతకుముందు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డుల ను పరిశీలించారు. కార్యక్రమంలె ఈవోపీఆర్డీ టి.కృష్ణా రావు, డీపీఆర్సీ కోఆర్డినేటర్ కె.చిన్న బాబు, పాతపట్నం ఈవో టి.కూర్మారావు, కోదూరు పంచాయతీ కార్యదర్శి జి.రాము తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించుకోవాలి

మెళియాపుట్టి: చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా వినియోగించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం పెంచుకోవచ్చని టెక్కలి డీఎల్పీవో ఐవీ రమణ తెలిపారు. శుక్రవారం పరసు రాంపురం పంచాయతీలో చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. రానున్నది వర్షాకాలం కావడంతో పంచాయతీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే



దివ్యాంగులను గుర్తిస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట : మండలంలోని 0 నుంచి 18 ఏళ్ల లోపు వయసు కలిగిన దివ్యాంగులను గుర్తిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ అన్నపూర్ణ తెలిపారు. మండ లంలోని చొర్లంగి పంచాయతీ మురగడలోయ గిరిజన గ్రామంలో శుక్రవారం ఇం టింటికి వెళ్లి దివ్యాంగ విద్యార్థులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 23 రకాల అంగవైకల్యాలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు గ్రామ సచివాలయాల పరిధిలో వీరిని గుర్తించి అవసరమైన పరికరాలను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ ఎస్.సురేష్‌కుమార్, శ్రావణి పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు



టెక్కలిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు



ఎల్ఎన్‌పేట: కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న ఎస్ఐ నిహార్

టెక్కలి: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు గడువు సమీపిస్తుండడంతో గ్రామాల్లో శాంతిభద్రతలకు సహకరించాలని, ఎటువంటి అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బాల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం టెక్కలిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి ర్యాలీలు, విజయోత్సవాలు చేపట్టేందుకు అవకాశం లేదని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. సీఐ పి.షైడయ్య, ఎస్ఐలు లక్ష్మి, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం కల్పించాలి

మెళియాపుట్టి: గ్రామాల్లో ప్రశాంతవాతావరణం కల్పించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని పాతపట్నం సీఐ నల్లి సాయి కోరారు. శుక్రవారం చాపరలో పోలీస్‌లు కవాతు నిర్వహించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో సోదరభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహమ్మద్ యాశిన్, టి.రాజేష్ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు

సుమంతాపురం(ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో అల్లర్లకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సరుబుజ్జిలి ఎస్ఐ బి.నిహార్ అన్నారు. సుమంతాపురం గ్రామంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నందున గ్రామాల్లో రాజకీయ పార్టీల సమావేశాలు, జనాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడ దన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలకు తావివ్వొద్దు

జలుమూరు: గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్ఐ మధుసూదనరావు అన్నారు. అల్లాడ పంచాయతీ రామదాసుపేటలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎటువంటి సమావేశాలు, ర్యాలీలు చేపట్టకూడదన్నారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మెళియాపుట్టి: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



జలుమూరు: వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆలయంలో ఎంజీఆర్ ప్రత్యేక పూజలు

కొత్తూరు: నివగాం, శోభనాపురం గ్రామాల్లో ఉమా కేదారశుద్ధ స్ఫటిక లింగేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి ఆలయాల వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం టీడీపీ సీనియర్ నేత, ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు అగతముడి అరుణ్, అగతముడి మాధవ రావు, లోతుగెడ్డ తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

కొత్తూరులో లోతుగెడ్డ ఉపేంద్ర కొన్నాళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకొన్న గోవిందరావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



గాయపడిన కార్యకర్తను పరామర్శిస్తున్న ఎంజీఆర్

ప్రసవ వేదనపై వివరణ కోరిన ఎంపీడీవో

సంతబొమ్మాళి: నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవం నిమిత్తం వచ్చిన గర్భిణికి వైద్య సేవలు అందపోవడంపై వివరణ ఇవ్వాలని వైద్యాధికా రులను ఎంపీడీవో జి.ఉమాసుందరి ఆదేశించారు. గర్భిణికి వైద్య సేవలు అందకపోవడంపై ప్రతికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన ఎంపీడీవో 24 గంటల పీహెచ్‌సీలో వైద్యసేవలు అందకపోవడంపై వైద్యులు పరిమళ, నందిని నుంచి వివరణ కోరారు. దీనిపై గురువారం డిప్యూడీ డీఎంహెచ్‌వో ప్రసాద్ దర్యాప్తు చేసిన సంగతి విదితమే. వైద్యుల నుంచి వివరణ వచ్చిన వెంటనే నివేదిక కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంపీడీవో ఉమా సుందరి తెలిపారు.

4 నుంచి 9 వరకు ఉచితంగా యోగా శిక్షణ

నరసన్నపేట: స్థానిక యోగా భవన్‌లో ఈనెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు వారణాశి సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం, సుదర్శన క్రియపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సూర్యనారాయణస్వామి ఆలయం ఎదురుగా ఉన్న యోగా భవన్‌లో ఈ శిక్షణ ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు ఇవ్వ నున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస: మండలంలోని దూసి గ్రామ సమీపంలో సుమారు 40 సంవత్సరాలు వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం దూసి వీఆర్వో రాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించగా దూసి రైల్వేస్టేషన్ సమీపంలోని జీడితోటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడాన్ని గుర్తించడం జరిగిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌లో భద్రపరిచినట్టు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస పోలీసులను సంప్రదించాలని కోరారు.

వివాహిత మృతిపై డీఎస్పీ విచారణ


విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

జి.సిగడాం: శేతు భీమవరం పంచాయతీ పెనసాం గ్రామంలో శుక్రవారం బెవర మేరీ సలోమి అలియాస్ నిఖిత (22) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం శ్రీకాకుళం డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు గ్రామానికి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సలోమి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. సలోమి భర్త జగదీష్, మరిది ఈశ్వరరావు, అత్త మల్లేశ్వరి, మామ అప్పలనాయుడి వరకట్న వేధింపులు వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు శంకరరావు, దేవి ఆరోపించారు. తండ్రి శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.మధుసూదనరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌తో పోలీసులు

సోంపేట: మహేంద్రతనయ నదిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఎక్సైజ్ పోలీసులు అడ్డుకున్నారు. మండలం బాతుపురం, హంసమొర తదితర ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు. ఈ దాడుల్లో మైనింగ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కేఎల్‌వీ గణేష్, ఇరిగేషన్ డీఈ జీవీ రమణ, ఏఈ సూర్యప్రకాష్, డీఈ పీఎల్ఎన్ ప్రసాద్, ఏఈ కమల్‌వికాష్, బారువ ఎస్ఐ ఎల్.చంద్రశేఖర్, ఆర్ఐ రవికుమార్ తదితరులు ఉన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

హరిపురం: మందస మండలం చిన్నకోష్ట గ్రామం వద్ద మహేంద్ర తనయ నదిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై శుక్రవారం ఎస్ఈబీ సీఐ జైభీమ్ ఆధ్వర్యంలో ఇరిగేషన్, రెవెన్యూ, భూగర్భ గనులు, పోలీస్ శాఖల సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇసుక లోడుతో ఉన్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని మందస పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల సమయం కావడంతో అధికారులు ఆ విధుల్లో ఉండగా గత పది రోజులుగా ఇసుక అక్రమ రవాణా సాగిపోతోంది. పక్కా సమాచారంతో దాడి చేసినట్టు తెలిపారు. మహేంద్రతనయలో ఇసుక తవ్వకాలు నిషేధమని ఎవరు తవ్వకాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో భూగర్భ గనుల శాఖాధికారి కేఎల్‌వీ గణేష్, ఇరిగేషన్ డీఈఈ జీవీ రమణ, ఏఈ సూర్యప్రకాష్, మందస ఎస్ఐ అనిల్‌కుమార్, రెవెన్యూ శాఖాధికారులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

గార: అంపోలు జిల్లా జైలు సమీపంలో శుక్రవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీను పట్టుకున్నట్టు ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు. సబ్ అధికారులతో కలిసి ఈ ఇసుక లారీను పట్టుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

బుడితిలో చోరీ

జలుమూరు (సారవకోట): బుడితిలో పంచిరెడ్డి నారాయణరావు ఇంటిలో గురువారం రాత్రి చోరీ జరిగింది. నారాయణరావు ఇంటికి తాళాలు వేసుకొని కుటుంబంతో తీర్థ యాత్రలకు వెళ్లాడు. ఇంటి ముందు ఉన్న పూల మొక్కలకు ప్రతీ రోజు నీళ్లు పోయమని పక్కింటి వారికి చెప్పాడు. దీంతో పక్కింటి ఆయన శుక్రవారం ఉదయం మొక్కలకు నీరు పోయడానికి వెళ్లేసరికి తలుపులు తీసి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు, క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించి చోరీ జరిగిన తీరును తెలుసుకున్నారు. కుటుంబ యజమాని లేకపోవడంతో ఇంట్లో ఏమేమి పోయాయి అన్నది తెలియరాలేదు. ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

రిమ్స్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పార్వతి

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్) సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.స్వామినాయుడు శుక్రవారం పదవీవిరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా డాక్టర్ పార్వతి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శనివారం డీఎంఈ నుంచి ఉత్తర్వులు సంబంధిత అధికారులు వెల్లడించారు. కాగా డాక్టర్ స్వామినాయుడు దంపతులను రిమ్స్ వైద్య బృందంతో పాటు అన్ని విభాగాలు అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిమ్స్ ఆర్ఎంవోలు సుభాషిని, భానుప్రకాష్, వైద్యులు ప్రసన్నకుమార్, అనురాధ, జీజీహెచ్ కళాశాల ప్రిన్సిపాల్, శానిటేషన్ పీఆర్వో రమేష్ ఎంఎస్‌వో శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు యూనియన్ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో


మాట్లాడుతున్న ఆర్ఎం తిలక్

శ్రీకాకుళం క్రైం: నగరంలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ బ్రాంచ్‌లో శనివారం రిటైల్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు బ్యాంక్ రీజనల్ అధికారి ముద్దాన వెంకట తిలక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బ్రాంచ్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 56 బ్రాంచ్‌లు ఉన్నాయని వీటితో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. గతేడాది యూనియన్ బ్యాంక్ రిటైల్ లోన్స్ ద్వారా రూ.150 కోట్ల మేర రుణాలు అందించామన్నారు. ఈ ఏడాది రిటైల్ ఎక్స్‌పో ద్వారా రూ.200 కోట్లు రుణాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఎడ్యుకేషన్ లోన్లు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా రూ.40 లక్షలు రుణాలు ఇచ్చిన ఘతన యూనియన్ బ్యాంక్‌దే అన్నారు. ఈ రిటైల్ ఎక్స్‌పోకి విశాఖ జోనల్ హెడ్ షాలిని మెనోన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

ప్రకటనలకు ఖర్చు ఎందుకు?

ఇచ్ఛాపురం: కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏసీలు బాగుచేయాలని, హాల్‌కు రంగులు వేయాలని తొలి సమావేశంలో చెప్పినా నిధులు కేటాయించలేదు.. ఇప్పుడు పబ్లిసిటీ పోరుతో పురపాలక సామాజిక రాజకీయ మాసపత్రిక బుక్‌లో ప్రకటనలకు నిధులు కేటాయించడానికి ఆమోదం కోరడం ఏంటని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మీ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఎజెండాలో పొందుపరిచిన పలు అంశాలపై చర్చించారు. ట్యాంకర్లు ద్వారా తాగునీటిని అందించేందుకు అద్దె ట్యాంకర్ల ద్వారా కాకుండా కొత్తవి కొనుగోలుకు (ఐదు వేలు, రెండు వేలు లీటర్లు గల రెండు ట్యాంకర్లు రూ1.50 లక్షలు) కౌన్సిల్ ఆమోదం కోరగా కౌన్సిల్ ఆమోదించింది. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్లు ద్వారా నీటిని అందించాలని 11వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి అధికారులను కోరింది. నీలకంఠేశ్వర వీధి కాలువలో మురుగు తొలగించాలని కోరారు. వెంటనే తొలగించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని లీలారాణి కోరారు. 23వ వార్డు బెల్లుపడ కాలనీలో సొంత డబ్బులు రూ.1లక్ష ఖర్చు చేసి కల్వర్టు నిర్మించి ఏడాది పూర్తవుతున్నా ఎందుకు బిల్లు చేయరని వార్డు కౌన్సిలర్ ప్రదీప్ అధికారులను నిలదీశారు. వెంటనే బిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, టీపీఎస్ నారాయణరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొగాకు వినియోగాన్ని నివారిద్దాం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాదరావు
- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



అరసవల్లి: ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాదరావు

అరసవల్లి: ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న పొగాకు వినియోగాని నివారించేలా ప్రతి ఒక్కరిని చైతన్యం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ, జాతీయ పొగాకు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. పొగాకు వినియోగాన్ని నివారించడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దామన్నారు. 20 రోజుల పాటు పొగాకు వినియోగాన్ని రూపుమాపే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మానవ హారంగా ఏర్పడి పొగాకు వినియో గానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ లక్ష్మి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, అధికారులు రవిప్రసాద్, సురేష్, అప్పారావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రెడ్‌క్రాస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు

పలాస రూరల్: పొగాకును వాడి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని వైద్యులు సూచించారు. రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కలిగించారు. పొగాకు, ఇతర మత్తు ఇచ్చే ఉత్పత్తులు సేవించడం ద్వారా చెడుమార్గం అలవడుతుందన్నారు. వీటిని విడనాడేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సునీల్‌కుమార్, మౌనిక, ఫార్మసీ అధికారి బోనెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో జీవితం అనర్థం

నరసన్నపేట: పొగాకు వాడితే జీవితం అంధకారంలోకి వెళుతుందని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉర్లాంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. పొగాకు వినియోగంతో అనేక రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దూరంగా ఉండాలి

ఎల్ఎన్ పేట: ఆరోగ్యానికి ప్రమాకరమైన పొగాకును వాడవద్దని వైద్యాధికారులు ఎ. లక్ష్మీదీప్, నీతూ అన్నారు. తురకపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


పలాసరూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న రెంటికోట పీహెచ్‌సీ సిబ్బంది


నరసన్నపేట: ఉర్లాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


ఎల్ఎన్ పేట: తురకపేటలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వంద రోజుల పనిదినాల కల్పనే లక్ష్యం

- డ్వామా పీడీ చిట్టిరాజు


కలెక్టరేట్: మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

కలెక్టరేట్: ఉపాధి హామీ పథకం వేతనదారుల అందరికీ వంద రోజుల పని దినాల కల్పనే లక్ష్యంగా పనిచేయాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత స్థాయిలో జరుగుతున్న పనులను ప్రతీ రోజు ఏపీవో, టీఏ, ఈసీ పరిశీలించాలని, అప్పుడే పనుల్లో నాణ్యత పెరుగుతుందని, అప్పుడే సగటు వేతనం రూ.295 చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పంట కాలువల్లో పూడికతీత పనులను పెద్ద ఎత్తున చేపట్టాని సూచించారు. చెరువుల్లో పూడికతీత పనులకు సంబంధించి ఎటువంటి అంచనాలను రూపొందించవద్దని, అందుకు ప్రత్యామ్నాయంగా కొత్త తరహా పనులను గుర్తించి అంచనాలు రూపొందించాలన్నారు. ఈ నెల 7వ తేదీలోగా ఎస్టిమేషన్లు తయారు చేసి జిల్లా కార్యాలయానికి పంపించాలని సూచించారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఏపీడీలు లోకేష్, శైలజ, రాధ, మురళీకృష్ణ, కేవీ అప్పలనాయుడు, సూపరింటెండెంట్ మురళీధర్, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశించిన వేళల్లో పనిచేయాలి

గార: ఉపాధి వేతనదారులు వారికి నిర్దేశించిన వేళల్లో పనులు చేయాలని డ్వామా పీడీ చిట్టిరాజు అన్నారు. శుక్రవారం ఉదయం వాడాడలో చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఏపీవో సంధ్యారాణి, జేఈ నారన్నాయుడు, సిబ్బంది ఉన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు నిఖిల ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన నిఖిల

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన దట్టి నిఖిల సాయి (9సం..7నెలలు) అండర్-15 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయింది. ఈమేరకు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు (మెంటర్) పుల్లెల శాస్త్రి, శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన సాయికి అవసరమైన క్రీడా పరికరాలు అందించడంతోపాటు అకాడమీ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. నిఖిల ఎంపికపై స్థానిక ఐసీసీ క్లబ్ కోచ్ డి.గోపి, తండ్రి దట్టి ఈశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో పెరుగుతున్న రోగులు


చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

పొందూరు: పెరుగుతున్న ఎండలతో వడదెబ్బ, ఇతర ఆరోగ్య సమస్యలతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు పెరుగుతున్నారు. ముఖ్యంగా డయేరియాతో రోజూ పదుల సంఖ్య లో రోగులు చికిత్సకోసం చేరుతున్నారు. పొందూరు మండలంతో పాటు జి.సిగడాం, లావేరు సంతకవిటి మండలాలకు చెందిన రోగులతో ప్రభుత్వ ఆసుపత్రి కిక్కిరిసిపోతోంది. వడదెబ్బ, డయేరియా మందులను అవసరం మేరకు సిద్ధంగా ఉంచామని ఆసుపత్రి సూపరింటెండెంట్ రామదాస్ తెలిపారు.

అందరికీ ఉపాధి పనులు కేటాయించాలి


రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న వేతనదారులు

బూర్జ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న ఉపాధి హామీ పనులు అందరికీ కల్పించాలని వేతనదారులు డిమాండ్ చేశారు. లక్కుపురం గ్రామంలో ఉపాధి లేక వేతనదారులు శుక్రవారం రోడ్డెక్కారు. లక్కుపురం గ్రామానికి చెందిన వేతనదారులు పనులు కల్పించలేదని రహదారి బైఠాయించి ధర్నా చేశారు. ఇప్పటివరకు రెండు వారాలు మాత్రమే పని కల్పించారని, తమకు ఉపాధి హామీ తప్ప మరే ఇతర ఆదారం లేదన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పనులు కల్పించాలని కోరారు. పనులు కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉపాధి హామీ ఏపీవో రాజ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా వారం రోజుల్లోపు ఉపాధి హామీ పనులు కల్పిస్తామన్నారు.

నేడు షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: పెంట గ్రామంలో గల షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం శనివారం ప్రారంభించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బాబా ఉత్సవ విగ్రహాలను, చిత్రపటాన్ని గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ వార్షికోత్సవాల్లో కావడహారతి, సుప్రభాతం, అభిషేకాలు, దాన్యాదివాసం ఉంటాయన్నారు.

సంతోషిమాతకు సారె



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో వైశాఖమాసం శుక్రవారం సందర్భంగా 58 పిండి వంటలు స్వీట్లు, పట్టుచీరతో సారెను నైవేద్యంగా అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో పెట్టడం జరిగింది. అమ్మవారికి శ్రీ సూక్తం విధానంగా షోడశోపచార సహిత సహస్ర కుంకుమార్చన పరివార దేవతార్చన అమ్మవారికి కుంకుమ పూజలు, త్రికాలార్చనలు అమ్మవారి జపం దుర్గా సూక్త పారాయణం లలితా సహస్ర నామ పారాయణం చతుర్వేద పారాయణం వేద ఆశీర్వచనం ప్రత్యేక పూజలు అర్చనలు, నీరాజనం మంత్రపుష్పం పూజలు నిర్వహించారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి


సమీక్షిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: కౌంటింగ్ ప్రక్రియ, అధికారులు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోలింగ్ విధులను నిర్వహించినట్లే కౌంటింగ్ విధులను కూడా అంకిత భావంతో చేపట్టాలని కోరారు. సమావేశంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, డీపీవో వెంకటేశ్వర్లు, చల్లా ఓబులేసు, నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పగలు వెలుగుతున్న వీధి దీపాలు

గార: మండలంలోని చాలా గ్రామాల్లో వీధి దీపాలు పగలూ రాత్రీ తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు బుడ్డా లలిత, పీసా గోపితో పాటు పలువురు ఈ విషయాన్ని సభదృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ పవన్‌మూర్తి బదులు ఇస్తూ.. గ్రామ పంచాయతీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవచ్చునన్నారు. వాడాడ అంపోలు, కొర్ని, కె.మత్స్యలేశం మొదలైన గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపీడీవో బి.కల్యాణి, వైస్ ఎంపీపీ అంధవరపు బాలకృష్ణ, అరవల రాము, ఈవోపీఆర్డీ పి.శ్రీనివాస్, ఏఈ కె.వెంకటేష్, ఏపీవో. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరరావు

గుజరాతీపేట: ఉపాధ్యాయుల సమస్యలను అధికారుల దృష్టిలో పెట్టి పరిష్కారానికి ఏపీటీఎఫ్ నేత చలపతిరావు కృషిచేశారని డీఈవో కె.వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకుడు, ఆంగ్ల భాష సహాయకుడు టెంక చలపతిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక నాయకుడిగా ఏ విధంగా ఉండాలో చలపతిరావు ఒక ఉదాహరణ అన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డు డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, ఫెడరేషన్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్, డీసీఈబీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, ఏపీఎన్జీవో నాయకుడు హనుమంతు సాయిరాం, వివిధ సంఘాల నాయకులు బి.సుమలత, బి.లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి యాత్రకు ఏర్పాట్లు


సమావేశమైన గ్రామ పెద్దలు

జి.సిగడాం: పెంట గ్రామంలో గల దుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ యాత్ర నిర్వహణకు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆలయ ప్రాంగణంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్న యాత్ర మహోత్సవాలకు గ్రామ పురజనులు, యువకులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మూడు రోజులు పాటు అమ్మవారికి పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లుపై పురోహితుడు రంగబాబు ఆధ్వర్యంలో చర్చించారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు డోల రామారావు, డోల సత్యం, డోల సూర్యారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా హోంగార్డుపై విజయనగరంలో అత్యాచార కేసు నమోదు

విజయనగరం క్రైం: విజయనగరం జిల్లా కేంద్రం దిశ మహిళా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన హోంగార్డు రాజ్‌కుమార్‌పై అత్యాచార కేసు నమోదైనట్టు దిశ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంకు చెందిన రాజ్‌కుమార్ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28న పోలీస్ వాహనంలో విజయనగరం వచ్చి తిరిగి కుమిలి, పూసపాటిరేగ మీదుగా శ్రీకాకుళం వైపు వెళ్తుండగా.. అదే సమయంలో విజయనగరంలోని లంకవీధి, జొన్నగుడ్డు ప్రాంతానికి చెందిన ఓ జంట ద్విచక్రవాహనంపై అదే రహదారిలో పూసపాటిరేగ వైపు వెళ్తున్నారు. గుణుపూర్‌పేట డంపింగ్ యార్డు సమీపానికి వచ్చేసరికి హోంగార్డు వారి ద్విచక్రవాహనాన్ని అడ్డగించి ఆ జంటను బెదిరించి సమీప నిర్మాణష్యమైన తోటలోకి తీసుకెళ్లి ఆ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. అనంతరం ఆ జంట తేరుకుని డెంకాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డెంకాడ పోలీసులు సంబంధిత కేసును దిశ పోలీస్ స్టేషన్‌కు రిఫర్ చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించి అత్యాచారానికి పాల్పడ్డ హోంగార్డును గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కంచిలి: జూన్ నెలలకు సంబంధించిన పింఛన్లను శనివారం నుంచి పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో వినీరజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో లాగే ఈ నెల కూడా 75శాతం పింఛన్లు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, బ్యాంక్ ఖాతా లేని వారికి ఇంటింటికి వెళ్లి సచివాలయ ఉద్యోగులు ద్వారా పింఛన్ డబ్బులు అందిస్తామన్నారు. మండలంలోని 9,799 మంది పింఛన్‌దారులకు రూ.2,88,23,500 మొత్తంలో బ్యాంక్‌ల ద్వారా నేరుగా అందించనున్నట్టు తెలిపారు.

గుర్తింపులేని పాఠశాలల వివరాలు తెలియజేయండి

గుజరాతీపేట: జిల్లాలో గుర్తింపు లేని అన్ని యాజమాన్యాల పాఠశాలల వివరాలు ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే తెలియజేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు తెలుసుకోవడం బాలల హక్కు అన్నారు. ఇటువంటి పాఠశాలల్లో చేర్పించడం వల్ల పిల్లల భవిష్యత్ అగమ్యగోచరమే కాకుండా తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిన వారవుతారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తాత్సారం చేసే ఆయా పాఠశాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు స్పష్టం చేశారు.

విత్తనాలు సిద్ధం చేయించండి

పొందూరు: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. వర్షాలు కురిసే సమయానికి విత్తనాలు సిద్ధం చేస్తే రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఇప్పటికే అవసరమైన విత్తనాల కోసం ఇండెంట్ పంపించామని సంబంధిత అధికారులు తెలిపారు. అనంతరం మూడు నెలల ఆదాయ వ్యయాలపై సభలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కూన ప్రమీల, బాడాన హారిక, కె.సూర్యారావు, వైస్‌ఎంపీపీ వండాన ప్రీదేవి, సర్పంచ్ పైడి రామప్రసాద్, ఎంఈవోలు రామరాజు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు

ఇచ్ఛాపురం: మండలం, మున్సిపాల్టీలోని ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. శుక్రవారం వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో అందిస్తున్న వివిధ సేవల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మిగిలిన వివరాలకు 77028 46309, 90101 01753 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సహిత ఉపాధ్యాయులు సూర్యం, సోమేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి

గార: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పరిశుభ్ర వాతావరణంలో పెట్టాలని డీఈవో వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిజామాబాద్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం కారణంగా పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాన్నారు. ఎటువంటి ఫిర్యాదులకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

హరిపురం/ ఇచ్ఛాపురం/ కంచిలి/ సోంపేట/ సరుబుజ్జిలి: జిల్లాలో పలుచోట్ల శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. హరిపురం, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, సరుబుజ్జిలి, ఆమదాలవలసలో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు హరిపురంలో మామిడి కాయలు నేలరాలాయి. కంచిలిలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. కాగా, నెలరోజులుగా ఎండవేడి, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది.


హరిపురంలో కురుస్తున్న వర్షం


ఇచ్ఛాపురంలో వర్షం


ఆమదాలవలసలో...